క్లుప్తంగా

సమ్మోహనంగా సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్: వాగ్గేయకారుల కీర్తనలు రాగాలై ప్రవహించాయి. కీర్తనలు సమ్మోహనంగా సాగాయి. మూడు గంటలపాటు జరిగిన కచేరీ ఆద్యంతం సంగీత ప్రియులను ఆకట్టుకుంది. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి సంగీత సంయోజనం కార్యక్రమంలో భాగంగా శనివారం శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ప్రముఖ విదూషీమణులు శ్రీయా శ్రీనివాస్, శ్రీజ శ్రీనివాస్ సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. ఆనంద నర్తన, నాద సుధారస, మామవ మీనాక్షి, నీకేల దయరాజు, థిల్లానా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. తిరుపతికి చెందిన సంపత్ కుమార్ వయోలిన్‌పై, వీరంరాజు లక్ష్మీఅజయ్ మృదంగంపై సహకరించారు. విద్యావేత్త ఎమ్‌సీ దాస్ మాట్లాడుతూ యువ సంగీత కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. సంస్థ కార్యదర్శి సీవీ రావు సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవపై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం, రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో శనివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం జరిగింది. సఫాయి కర్మచారీల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి. వెంకటేశ్వర్లు సఫాయి మిత్రలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ శానిటైజర్లు, మాస్కులు, సబ్బులు పంపిణీ చేశారు. ఆరోగ్య, రక్త పరీక్షల స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ ఏజీవీ సాయి ప్రసాద్, డాక్టర్స్ మహీధర్, కృష్ణ చైతన్య, నందిని, ఎస్ఆర్ఎఫ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెలలో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో



గుణదల(విజయవాడతూర్పు): నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో వచ్చె నెల 4, 5, 6 తేదీల్లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో – 2024 నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి తెలిపారు. గుణదలలోని హోటల్ హయత్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఈ మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్, కేటరర్స్ అసోసియేషన్, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్, విజయవాడ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో రెస్టారెంట్స్ పెట్టాలి అనుకునేవారికి కమర్షియల్ కిచెన్ ఎక్విప్‌మెంట్, హౌస్ పర్పస్ కోసం హోమ్ అప్లయన్సెస్, ప్యాకింగ్ అండ్ సీలింగ్ మిషనరీ, మసాల్స్, పికిల్స్, ప్రోజన్ ఫుడ్స్ వంటి 120 స్టాల్స్ వరకు కొలువుతీరతాయని వెల్లడించారు. అలాగే బిజినెస్ ఉన్న వారు ఇక్కడ స్టాల్స్ పెట్టుకుని వారి వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా 4 వీలర్స్ కారు ఎక్స్‌పో, లైవ్ ఫుడ్ స్టాల్స్, ఫన్ ఎక్టివిటీస్, ఇంటరాక్టివ్ ఎక్టివిటీస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఏపీ కేటరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వరదరాజులు, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వక్కలగడ్డ భాస్కరరావు, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, గెద్దం రవి, రాఘవ, ఎం. వెంకటేశ్వరరావు, కె.వెంటేశ్వరరావు, చుండూరు ఉమామహేశ్వరరావు, రేణుకా శ్రీదేవి పాల్గొన్నారు.

29న కృష్ణాజిల్లా రచయితల సంఘం మహాసభలు

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం మహాసభలు ఈ నెల 29వ తేది ఆదివారం అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో నిర్వహిస్తునట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, కవి నగ్నముని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పర్యావరణ సదస్సు, సాహితీ మూర్తుల పురస్కారాలు, కవితా గోష్ఠి జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి, పెన్నులు, నోటుబుక్స్‌ను విజయవాడ వాసవి క్లబ్, విశాఖపట్నం గోగుల చారిటబుల్ ట్రస్టీ వారు శనివారం అందజేశారు. ఈ పరిసర ప్రాంతాల్లోని 6 మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు కూడా ఉచితంగా బుక్స్‌ను అందించారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 150 విలువ చేసే పరీక్షా సామగ్రిని అందజేసినట్లు దాతలు తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు, వాసవి క్లబ్ సభ్యుడు కిషోర్ పాల్గొన్నారు.

ద్వీపం.. పునర్వైభవం ఎన్నటికో?

- సుమారు 12 అడుగుల వరద నీటిలో భవానీ ఐలాండ్ మునక
- వరద తాకిడికి కోసుకుపోయిన తీరం
- ద్వీపంలో ఎక్కడ చూసినా ఇసుక మేటలు
- యాక్టివిటీస్ అన్నీ ధ్వంసం



బురదమయమైన గేమింగ్ జోన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విజయవాడ భవానీపురంలోని భవానీ ద్వీపంలోకి దాదాపు 12 అడుగుల మేర చేరిన వరద నీటితో అతలాకుతలమైంది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి పొందిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో భాగమైన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కు చెందిన భవానీ ద్వీపం పూర్తిగా దెబ్బతింది. వరద ఉధృతి తాకిడికి ద్వీపం అంచులు కోసుకుపోయాయి. ద్వీపం మొత్తం ఇసుక మేటలు వేసి పాత్‌వేలు కనబడకుండా పోయాయి. పుష్యమి హోటల్‌లో ఇసుక దిబ్బలు కనబడుతున్నాయి. గేమింగ్ జోన్ మొత్తం మునిగి దానిలోని గేమ్స్‌కు సంబంధించిన పరికరాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పాడైపోయాయి. పిల్లలు ఆడుకునే పరికరాల చుట్టూ ఇసుక మేటలతో కప్పబడింది. ద్వీపంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కాటేజీల సెల్లార్లు మునిగిపోయాయి. కాటేజీల రెన్నోవేషన్‌లో భాగంగా ఊడదీసిన ఏసీ మెషీన్లు కూడా నీట మునిగాయి. ద్వీపం ప్రవేశంలో ఉన్న రిసెప్షన్ కౌంటర్, అందులోని మేనేజర్ క్యాబిన్, సీసీ కెమెరాలు, ఇంటర్ కమ్ బేకప్, ఇంటర్‌నెట్, కిచెన్, దాని స్టోర్, జనరేటర్, ఎలక్ట్రికల్ రూమ్, ట్రాన్స్‌ఫార్మర్స్ మొత్తం వరద నీటితో మునిగిపోవడంతో పనికిరాకుండా పోయాయి. వరద నీటితో ల్యాండ్ స్కేప్, అలాగే పక్షుల కేంద్రం వెనుక ఉన్న రోడ్ ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా కూలిపోయిన వృక్షాలతో అధ్వానంగా మారింది. అమరావతి బోటింగ్ క్లబ్‌కు చెందిన బోట్లు వరద నీటిలో కొట్టుకు వచ్చి ద్వీపంలోకి చేరుకున్నాయి. వరద వేగానికి ద్వీపం ప్రవేశ మార్గం వద్ద ఉన్న జట్టీ పైకి ఎక్కేసింది. ద్వీపంలోని ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లోని కొలంబస్, డ్రాగన్ ట్రెన్, పిల్లలు ఎక్కే రకరకాల రైడ్స్ అన్నీ నీట మునిగాయి. కాగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల ద్వీపానికి వచ్చి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. దాదాపు రూ. 10 కోట్ల మేర నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యమైనంత త్వరలో ద్వీపాన్ని పునరుద్ధరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తానని ఆయన తెలిపారు. ద్వీపం చక్కబడి ఎన్నటికి పునర్వైభవం కలుగుతుందోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.



టూరిజం క్యాంగాన్ పుష్యమి చుట్టూ పేరుకుపోయిన ఇసుక మేట



పిల్లల ఆట పరికరాల చుట్టూ ఇసుక మేట



ఇసుక మేటతో నిండిన అమరావతి ఆతిథ్యం హోటల్ (గ్లాస్ రెస్టారెంట్)

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు జయంతిని సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గురజాడ జీవిత విశేషాలను పాఠకులకు వివరించారు. గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరిగా పేరుగడించారని తెలిపారు. ఆయన ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో తన రచనలు చేసారని, వారు రచించిన 'కన్యాశుల్కం నాటకం' సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుందని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

నగర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ దుర్గాగ్రహారంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ గణనాథుని చల్లని దీవెనలతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. మహాగణాధిపతి ఆశీస్సులు నగర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని.. స్వామివారి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని భక్తులకు, నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా సుధాకర్, కోలంటి రవి, నాగేశ్వరరెడ్డి, ఆకెళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.



దుర్గాగ్రహారంలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రజలను నిండా ముంచిన ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగర ప్రజలను ప్రభుత్వం నిండా ముంచిందని, వరదలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి బాబూరావు మాట్లాడారు. వరదలకు 2.70 లక్షల కుటుంబాలు, ఎనిమిది లక్షల జనం నిండా మునిగిపోయారని, వందల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వైఫల్యమేనని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వరదల్లో నగరంతోపాటు ఎన్టీఆర్ జిల్లాలోని లక్షలాది మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రూ. 10 వేల కోట్లు కేంద్రం నిధులను విడుదల చేసి, బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పరిహారం పెంచాలి

వరదల్లో నష్టపోయిన గృహాలకు రూ. 50 వేలు, అలాగే దెబ్బతిన్న ఆటోకు రూ. 10 వేల నుంచి 25 వేలు, టూ వీలర్‌కు రూ. 3 వేల నుంచి 10 వేలకు పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీని పెంచి ఇవ్వాలని కోరారు. ఆగస్టు, సెప్టెంబర్ విద్యుత్ బిల్లులను రద్దు చేయడంతోపాటు గడుస్తున్న ఈ ఆర్థిక సంవత్సరపు ఆస్తి, ఇతర పన్నులను సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ సాధనకు సాంకేతిక పరిజ్ఞానం

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ సాధించేందుకు విజయవాడ నగర పాలక సంస్థ అన్ని విధాలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోంచుకుంటుందని స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్, స్వచ్ఛ భారత్ మిషన్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ మిషన్‌లో మిలియన్ ప్లస్ నగరాలు, రాష్ట్ర రాజధానులు, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థ నిర్వహణ తదితర అంశాలపై బడ్జెట్లో స్థానిక సంస్థలు చేయాల్సిన కేటాయింపు గురించి స్వచ్ఛ భారత్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్ర వీఎంసీ కమిషనర్‌కు వివరించారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లను ఆధునికీకరించటం, ప్రజలందరికీ నాణ్యమైన తాగునీరు సరఫరా అందించడం, ఘన వ్యర్థ పదార్థాల సేకరణ నిర్వహణ మెరుగుపరచటం లాంటి విషయాలపై అధునాతన విధానాలను అనుసరించడంపై వీఎంసీకి సూచనలు చేశారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ద్వారా శుద్ధి అయి వచ్చిన నీటిని వ్యవసాయానికి ఉపయోగించటం, స్వచ్ఛ భారత్ మిషన్ పై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వారిని భాగస్వాములు చేస్తూ ఇటువంటి కార్యక్రమాల్లో వారిని పాల్గొని చేసేలా చూడాలని కోరారు. కాన్ఫరెన్స్ లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్ఈ (ప్రాజెక్ట్)రామ్మోహనరావు, ఎస్ఈ (వర్క్స్) శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వరద బాధితులకు ఆపన్న హస్తం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో దెబ్బతిన్న 150 అంగన్‌వాడీ హెల్పర్ల కుటుంబాలకు సీఐటీయూ ద్వారా సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు. శనివారం గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ వరదల కారణంగా నిరాశ్రయులైన అంగన్‌వాడీ హెల్పర్స్, ఇతర కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు సీఐటీయూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుప్రజ, జిల్లా అధ్యక్షురాలు గజలక్ష్మి, జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): వరద బాధితుల సహాయార్థం ప్రశాంతి నగర్‌లోని స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వంట సామాన్ల కొనుగోలు నిమిత్తం 10 కుటుంబాలకు రూ. 10 వేలను బాధితులకు అందజేశారు. అలాగే రూ. 15 వేలు విలువ గల నిత్యావసర సరుకులను 18 కుటుంబాలకు అందజేశారు. స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, లీగల్ అడ్వైజర్ కె.నరసింహమూర్తి, కమిటీ సభ్యులు నాగరాజు, శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, నూర్ భాష సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిమద్దీ చిన్న మాస్తాన్ తెలిపారు. సుందరయ్య నగర్‌లోని 125 వరద బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన నిత్యావసరాలను అందజేశారు. అక్కపల్లి ఎంపీటీసీ సభ్యుడు చిలకల బాలరంగారెడ్డి, మాజీ సర్పంచి కె.వెంకటరెడ్డి, సిహెచ్. పెదవెంకటరెడ్డి(రిటైర్డు కానిస్టేబుల్), భీమనబోయిన వెంకటరమణ, చాగంటి సుబ్బారెడ్డి, రామిరెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సస్పెక్ట్ షీటర్‌పై కేసు నమోదు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర బహిష్కరణ ఉత్తర్వులు ఉల్లంఘించి నగరంలో తిరుగుతున్న సస్పెక్ట్ షీటర్‌పై గవర్నర్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాయకాపురం రాధానగర్‌కు చెందిన పోతిరెడ్డి రంగారెడ్డిపై నున్న పోలీసు స్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. అతడిని కొంత కాలం క్రితం నగర బహిష్కరణ చేశారు. అయితే ఈ ఏడాది జూన్‌లో రంగారెడ్డి నగరంలోకి ప్రవేశించాడు. శనివారం ఉదయం హనుమాన్‌పేట పాత జీజీహెచ్ రోడ్డులోని శ్రీ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు వచ్చిన అతడిని గమనించిన కొందరు గవర్నర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. విజయవాడలోనే ఉంటూ ఆటో నడుపుతున్నానని, నేరాలు చేసేందుకే నగరంలోకి ప్రవేశించినట్లు విచారణలో అంగీకరించాడు. దీంతో అతనిపై నగర బహిష్కరణ ఉత్తర్వుల ఉల్లంఘన కింద గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి వరద ప్రభావిత లబ్ధిదారుల ప్రకటన

పటమట(విజయవాడతూర్పు): బుడమేరు, కృష్ణానది వరద ప్రభావంతో కోల్పోయిన వారికి ప్రభుత్వం సహాయం చేసేందుకు లబ్ధిదారుల కోసం ఇటీవల నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో తప్పులు, అభ్యంతరాలు ఉంటే సంబంధింత అధికారులకు ఈ నెల 22, 23 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలైన నగరంలోని 32 వార్డుల్లో ఉన్న సచివాలయాల్లో ఆదివారం సెలవు దినమైనప్పటికీ సచివాలయాలన్నీ పనిచేస్తాయని పేర్కొన్నారు. అధికారులు అందరూ అందుబాటులో ఉంటారని, ఆ సచివాలయాల్లో ఎన్యూమరేషన్ లబ్ధిదారుల లిస్టులను ప్రకటిస్తారన్నారు. ఆయా సచివాలయాల్లో సీనియర్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కూడా అందుబాటులో ఉంటారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ ఒక్కసారి ప్రకటించిన లిస్టును చూసి అభ్యంతరాలు ఏవైనా ఉన్నచో వెంటనే అక్కడున్న సీనియర్ ఆఫీసర్ కి కానీ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కి గాని తెలుపవచ్చని తెలిపారు. ప్రజలందరూ తమ తమ సచివాలయంలోకి వెళ్లి ఆ లిస్టు ను గమనించాలని సూచించారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక వనరుల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సామాజిక విశ్లేషకుడు లక్ష్మీనారాయణ అన్నారు. గవర్నర్‌పేటలోని రెవెన్యూ భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన జరుగుతున్న వర్క్‌షాపులో ఏపీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి–యువత ముందున్న బాధ్యత అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. సామాజిక విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో ఉన్నటువంటి చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం 'ఫాసిజం ప్రస్తుత దేశ పరిస్థితులు–యువత కర్తవ్యం' అనే అంశంపై మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత కలిగినటువంటి దేశం భారతదేశం అని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యా విభాగం డైరెక్టర్ ఏల్వీకే ప్రసాద్, పీ థామస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం యుగంధర్, సంతోష్‌కుమార్, ఎంవీ సుబ్బారావు, సహాయ కార్యదర్శి కత్తి రవి, షేక్ సుభానీ, వై బాబీ, లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



● బురద బాధలు..



వరద ముంపు నుంచి కోలుకున్న ప్రజలను బురద కష్టాలు వెంటాడుతున్నాయి. గృహాలన్నీ బురదతో నిండిపోయి ఉన్నాయి. ఇళ్లలో విలువైన టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు ఇతర సామాన్లు సైతం బురదతో నిండిపోయాయి. రామరాజ్యనగర్‌లో బురద బారి నుంచి బయటపడేందుకు జనం పడుతున్న అష్టకష్టాలు అంతా ఇంతా కాదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రభుత్వ కాలేజీలో స్పేస్ ఆన్ వీల్స్

పాయకాపురం(విజయవాడరూరల్): దేశం గర్వించదగిన విధంగా శ్రీహరి కోటలోని ఇస్రో సంస్థ అనేక రాకెట్, శాటిలైట్ ప్రయోగాలను విజయవంతం చేసిందని డీటీఈఓ, ఆర్ఐఓ సీఎస్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. పాయకాపురం రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్పేస్ ఆన్ వీల్స్ విజ్ఞాన దాయకమైన, సాంకేతిక హంగులతో కూడి ఉన్న పరికరాలను బస్సులో అమర్చి విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల్లోని హైస్కూల్స్, కళాశాల విద్యార్థు లు ఆసక్తిగా తిలకించారు. ఇస్రో టెక్నీషియన్స్ చంద్రయాన్, చంద్రయాన్-2 ప్రయోగాలను వివరించారు. అధ్యాపకులు కేవీరావు, శైలజ పాల్గొన్నారు.

వాహనాల మరమ్మతులు వేగవంతం

రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా

విజయవాడస్పోర్ట్స్: వరద ముంపునకు గురైన మోటారు వాహనాలకు మరమ్మతులు చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తెలిపారు. శనివారం నాటికి విజయవాడ నగరంలోని 65 ఆథరైజ్డ్ సర్వీసింగ్ సెంటర్ల ద్వారా 2,258 వాహనాలకు, లోకల్ మెకానిక్‌ల ద్వారా 4,676 వాహనాలకు రిపేర్లు పూర్తి చేయించామన్నారు. 67 మంది మోటారు వాహన తనిఖీ అధికారి(ఎంవీఐ)ల పర్యవేక్షణలో రిపేర్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. త్వరలోనే వాహనాల రిపేర్లు పూర్తి చేయించి వాటి యజమానులకు అప్పగిస్తామన్నారు. భీమా కంపెనీలతో చర్చలు జరిపి 4,836 పాలసీదారులకు రూ. 17.30 కోట్లను అందజేయడం జరిగిందన్నారు. ముంపు ప్రాంత ప్రజలను రక్షించడం, వారికి ఆహారం, తాగునీరు అందించడంలో రవాణా శాఖ కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు.

28న ఎంఎస్ఎంఈలపై రాష్ట్రస్థాయి మీటింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 28వ తేదీన తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ స్కీమ్స్, రాయితీలపై రాష్ట్రస్థాయి టౌన్ హాల్ మీటింగ్ నిర్వహించనున్నట్లు చైర్మన్ దాసరి దేవరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మీటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. వివిధ రకాల పరిశ్రమల స్థాపనపై అవగాహన, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంఎస్ఎంఈ స్కీమ్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల సబ్సిడీలు, పథకాల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా కానీ, 6305941717, 8919737517, 7013288343 నంబర్లను కానీ సంప్రదించాలని సూచించారు.

23 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి విజయవాడ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు శనివారం జరిమానా విధించారు. ఐదో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మంది పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకున్న వెంటనే న్యాయమూర్తి వద్ద హాజరుపర్చారు. వీరిలో ఏడుగురికి రూ. 15 వేల చొప్పున, 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకుడు, గాయకుడు, నిర్మాత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సినీ సంగీత సేవలను గుర్తు చేసుకుంటూ వారం రోజులపాటు కొత్తా పూర్ణానందం కళావేదిక మీద నిర్వహించే బాలు స్వర సప్తాహం కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం నాటి కార్యక్రమాన్ని కళాంజలి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించింది. గాయకులు సుశీల్‌కుమార్, ఆరికపూడి సాంబశివరావు, కళాంజలి, తొట్టింపూడి రమేష్, సుధీర్, గాయత్రి, భారతి, డాక్టర్ భాగ్యశ్రీ, చావా నరసింహారావు బాలు పాడిన సినీ గీతాలను ఆలపించారు. పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

డ్రోన్‌తో పోలీసుల ఆకస్మిక తనిఖీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): గంజాయి వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు శనివారం గుణదల పోలీసులు సీఐ వాసిరెడ్డి శ్రీను పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్‌తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధురానగర్ రైల్వే స్టేషన్, రైల్వేకాలనీ పరిసర ప్రాంతాలు, రైల్వేట్రాక్ తదితర నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగురవేసి పరిశీలించారు. అలాగే డాగ్ స్క్వాడ్‌తో మారుమూల నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ఎక్కడైనా గంజాయి వినియోగం, రవాణా జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. గుణదల పీఎస్ ఎస్ఐ ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీ చైనత్య కళాశాల డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. చుట్టుగుంట శ్రీ చైతన్య కళాశాలలో శనివారం ఆయన ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావుతో కలిసి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఈనెల 24వ తేదీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రంగారావు, సిబ్బందిపాల్గొన్నారు.

హాస్యం జీవితంలో భాగం కావాలి

విజయవాడ కల్చరల్: హాస్యం జీవితంలో భాగం కావాలని హాసం క్లబ్ కన్వీనర్ కమలాకాంత్ అన్నారు. హాసం క్లబ్ ఆధ్వర్యాన బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నెలవారీ హాస్య సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరసాల్లో హాస్యం ప్రధానమైనదన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం హాస్య సమ్మేళనం నిర్వహిస్తునట్లు తెలిపారు. సంస్థ సభ్యులు స్కిట్స్, జోక్స్, సినీ హాస్య పాటలతో నవ్వులు పూయించారు. సంస్థ నిర్వాహకుడు రామకృష్ణ బోడి ఆంజనేయరాజు, రవికుమార్, చంద్రశేఖర్, సువర్ణ లక్ష్మి, ఎస్పీ బోస్, దర్భా ఫణీంద్ర, ఎస్ఆర్ ప్రభాకర్ పాల్గొన్నారు.